Registered : RN 1156 / 57

No. A.P. / VJA / 52 / 6 / 2000



## అధిష్ఠానం

మొదటి పేజీ తరువాయి

సమావేశాలలో తప్పదు కాబట్టి సిఎల్పీ నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి శక్తి వంచన లేకుండా సమరం సాగిస్తున్నాడు. తగిన బలం లేకపోయినా, ముఖ్యమంత్రి ఎంత మొండిగా తమ వాదనలను గడ్డిపోచ క్రింద తీసిపారేస్తున్నా రాజశేఖరరెడ్డి మాత్రం నిరుత్సాహపడకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముందుకు నడిపిస్తున్నాడు. కాని తతిమా వారిలో ఆ ఆసక్తి ఎప్పుడో చచ్చిపోయింది. పిసిసి అధ్యక్షుడు సత్యనారాయణ రావు వునికి పత్రికలలో తప్ప కన్పడడం లేదు. ఆయనకు వయస్సు ఎక్కువ. ఇప్పటి తరం కాంగ్రెస్ వాదులెవరితో సంబంధాలు, చనువు లేవు. అందువల్ల కార్యకర్తల సంగతి దేముడెరుగు, కనీసం జిల్లా స్థాయి నేతలలో కూడా స్ఫూర్తి కల్గించడం ఆయన తరం కావడం లేదు. పేరుకు మాత్రమే పిసిసి అధ్యక్షుడి వునికి.

కోట్ల విజయభాస్కరరెడ్డి గారు పూర్తిగా విశ్రాంతిలోకి వెళ్లి పోయాడు. సిడబ్ల్యుసి నుంచి తనను తొలగించడం ఆయనకు జీర్ణం కాని అవమానం. అది తట్టుకోలేక ఆయన పూర్తిగా తెరమరుగై పోయాడు.

నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారిది ఒక ప్రత్యేక వ్యక్తిత్వం. ఎన్ని అవమానాలు, ఆశాభంగాలైనా మౌనంగా దిగమింగుకొని, మనసులోని భావాలు బయట పడకుండా కాంగ్రెస్‌ను కని పెట్టుకుని వుండడం ఆయన విశిష్టత. సిడబ్ల్యుసి సభ్యత్వం రాక పోవడం ఆయనకు తీరని నిరాశ కల్గించిన మాట వాస్తవం. అయితే దాన్ని తనలోనే దాచుకుని పార్టీ కార్యక్రమాలలో మామూలుగా పాల్గొంటున్నాడు.

ఎమ్మెల్యేలలోను వుత్సాహం లేదు. పెద్ద నేతల వలె వారు తమ ఆగ్రహాన్ని దాచుకోవడం లేదు. బహిరంగంగా వెళ్లగక్కుతున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన అంబికాసోని సమక్షంలో కొందరు ఎమ్మెల్యేలు అధిష్టానం వైఖరి తూర్పార పట్టడానికి సందేహించలేదు. నిర్భయంగా ఢిల్లీ పెద్దల తప్పులను విమర్శించారు వారు. కాని వారి ఆవేదన అరణ్య రోదనే అయ్యింది.

మరొక వర్గం కాంగ్రెస్ వాదులు కోస్తా జిల్లాలకు అన్యాయం జరుగుతున్నదన్న వాదనతో కొంత సందడి సృష్టించారు. కాని దానికి కూడా ఢిల్లీ దర్బారులో కదలిక రాలేదు.

ఎందుకోసం, ఎవరి కోసం తాము పార్టీ కార్యక్రమాలలో పాల్గొనాలని, ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి అన్న ప్రశ్న కార్యకర్తలలో విన్పిస్తున్నది. అందువల్లనే రైతు సమస్యలపైన, తెహల్కా డాట్ కామ్ విషయంలో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టమని సోనియాగాంధీ నుంచి, పిసిసి అధ్యక్షుడి వరకు ఎందరు ఎంతగా నెత్తినోరు బాదుకుంటున్నా జిల్లాల్లో స్పందన లేదు. పోరాటాలు తమవి, పదవులు ఢిల్లీ దేవిడీలలో పడి సేవ చేసే వారివా అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు అందరు.

అయితే ఢిల్లీ పెద్దలకు మాత్రం దీని ప్రభావం అంతుబట్టినట్లు లేదు.

కోవడం మాని, ఎమ్మెల్యేలు నేరుగా తమ అభిప్రాయాలు వెల్లడించడం సోనియా గాంధీ పెద్దరికాన్ని ధిక్కరించడం అవుతుంది జాగ్రత్త అని హెచ్చరిస్తున్నారు.

## అవినీతిపరులు

మొదటి పేజీ తరువాయి

మెయిల్‌కు వీరికి దగ్గర సంబంధం లేకుంటే ఇంత నిస్సిగ్గుగా స్టేషన్ నుంచి కార్ తీసుకవెళ్ల లేరు.

విజిలెన్స్, ఎసిబి విభాగాలు గతంలో కొందరు అధికారులపై విచారణ జరిపి, అవినీతిని నిర్ధారించి, తగిన చర్య తీసుకోమని సిఫార్సు చేసిన అధికారుల విషయంలోనూ ప్రభుత్వం ఇదే రకం ఉదాసీనత ప్రదర్శిస్తున్నది. వీరిలో ఒకరిపై కూడా చర్య తీసుకోకపోవడమే కాదు; వారందరికీ మంచి పోస్టింగులు ఇచ్చి, మరింత పెద్ద బాధ్యతలు అప్పగించారు. ఇటీవల నెల్లూరు మాజీ ఎస్పీ సి.వి. నరసయ్య గారిని కూడా ఇదే రీతిలో సత్కరించిన సంగతి తెల్సిందే కదా? గ్రీన్ గ్లోరి దగా బయట పడిన తర్వాత ఆయనకు డిఐజి ప్రమోషన్ ఇచ్చారు. అయితే ఈ దగాకోరు వ్యవహారంలో ఒక్క నరసయ్యగారే కాక, మరి కొందరు ఐపిఎస్ అధికారులు కూడా వున్నారని ఇప్పుడు తెలుస్తున్నది. తీగ లాగితె డొంక కదులుతుంది అన్న భయంతో వారిపై విచారణ జరపకుండా గమ్మునవుండి పోతున్నది ప్రభుత్వం.

ఆ మధ్య ఈనాడు దిన పత్రిక ఒక జైళ్ల శాఖ ఐజి గారి అవినీతిని నగ్నంగా బయటపెట్టింది. రాష్ట్రమంతా సంచలనం సృష్టించిన ఈ సంఘటనలోనూ ఎటువంటి చర్యా లేదు. ఆయన్ను కొంత కాలం ప్రక్కన పెట్టడం తప్ప, ఇంత పెద్ద నేరానికి ఒడిగట్టినందుకు ఎటువంటి చర్య తీసుకోలేదు. ఈనాడు దిన పత్రిక కొందరు ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల అవినీతి కథలనుఒకటి రెండు నెలల పాటు సీరియల్ కథలు వలె ప్రచురించింది. అదే పత్రికలో ఎవరయినా చిరుద్యోగి లంచం తింటున్నాడని వార్త వస్తే విరుచుకపడి, సస్పెండ్ చేసే ప్రభుత్వం ఈ ఉన్నతాధికారుల విషయంలో మాత్రం దొంగకు తేలు కుట్టినట్లు వుండిపోవడం గమనార్హం.

ముఖ్యమంత్రి పేషీ కూడా అవినీతి మయం అయిపోయిందని పలుసార్లు దిన పత్రికలు గగ్గోలుపెట్టాయి. కాని సంబంధిత అధికారులలో ఒక్కరిని కూడా ముఖ్యమంత్రి తన పేషీ నుంచి తొలగించలేదు. అదే అధికారులు రాత్రి, పగలు ఆయన వెంట వుంటున్నారు; మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని శాసిస్తున్నారు.

చంద్రబాబు విషయంలో ఇటువంటి సాదృశ్యాలు అసంఖ్యాకం. తన ఆరేడేళ్ల పదవీ కాలంలో ఒక్క ఉన్నతాధికారిపై కూడా చర్య తీసుకోలేదాయన. వారంటే ఆయన భయపడుతున్నారా అని సందేహించ వల్సి వస్తున్నది. ఉన్నతాధికారుల అవినీతిని అదుపు చేయకుండా చిరుద్యోగులపై ప్రతాపం ప్రదర్శిస్తే అవినీతిని రూపు మాపడం సాధ్యమా? కేవలం ప్రజల మెప్పు కోసం ఉపన్యాసాలు దంచడం తప్ప, అవినీతి తొలగించాలన్న ఆసక్తి నేతలకు ఎంత మాత్రం లేదన్నది దీన్ని బట్టి మన కర్థమయ్యే నిజం. *

అన్ని రకాల మందులు లభించును

వివేకా మెడికల్స్

పొగతోట, నెల్లూరు

ఫోన్ : 327691

